క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక



కొత్తగా ఎన్నికైన ఉత్సవ కమిటీ సభ్యులు

భీమునిపట్నం : భీమిలి గ్రామ దేవత శ్రీ నూకాలమ్మ వారి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా గిడితూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పీరుపల్లి రాజు, కోశాధికారిగా రాకోతు నర్సింగరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగిరెడ్డి స్వామి, అప్పికొండ బాలకృష్ణ ఎంపికయ్యారు. ఉత్సవాలు ఏప్రిల్ మొదటి వారంలో నిర్వహించనున్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో గల సాగరేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్మించిన యోగ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ముందుగా గణపతి పూజ నిర్వహించిన తర్వాత ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీవారి సన్నిధిలో విష్ణు సహస్రనామ పారాయణ



పారాయణ చేస్తున్న శ్రీవారి భక్తులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీవారి సేవకులు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉదయం 6.30 గంటల నుంచి పారాయణ ప్రారంభమైంది. ఆదివారం సెలవు రోజు కావడంతో శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు.

హోమియో మందుల పంపిణీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ 102 మంది రోగులను పరీక్షించి వారికి మందులు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, కె.పద్మజ, కె.అనురాధ, సభ్యులు లక్ష్మణరావు, శ్రీనివాసరావు, శంకర్, రాము పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధి ప్రదాత సీఎం జగన్



మిథిలాపురి వుడా కాలనీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ప్రజలంతా మరోమారు ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- రూ.58 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మధురవాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలంతా మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. జీవీఎంసీ 7వ వార్డు పరిధి భరత్‌నగర్‌లో డ్రెయిన్లు, రోడ్లు, మిథిలాపురి వుడా కాలనీ ఎంవీవీ ఓజోన్ వ్యాలీ వద్ద కమ్యూనిటీ హాలు, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణ పనులకు రూ.58 లక్షలతో ఆదివారం శిలాఫలకాలు ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. అనంతరం మిథిలాపురి వుడా కాలనీలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ 7వ వార్డులో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.72 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారానే ఇంత అభివృద్ధి సాధ్యమైందన్న విషయం గుర్తించుకోవాలన్నారు. గత ప్రభుత్వం మాదిరి శంకుస్థాపన చేసి వదిలేయకుండా తక్షణమే నిర్మాణ పనులు కూడా చేపడతామని చెప్పారు. కులం, మతం, రాజకీయం వంటి ఏ రకమైన వివక్ష లేకుండా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో ఏ పని కావాలన్నా నాయకులు, అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని... ప్రస్తుతం ప్రజల ఇంటి వద్దకే అన్ని రకాల సేవలు అందుతున్నాయన్నారు. వుడా కాలనీ ప్రాంతంలో కొద్ది నెలల వ్యవధిలోనే రూ.2 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి ఎమ్మెల్యే శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ జి.శైలజావల్లి, ఏఈ సురేష్, ఏపీడీ గంగాధర్, వార్డు కార్పొరేటర్ పి.మంగమ్మ, వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, చేకూరి రజని, మంగూరి వెంకటరమణ, ఎంవీ రమణమూర్తి, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, రైల్వే బోర్డు సభ్యుడు ఎన్.బాబ్జి, వివిధ విభాగాల నాయకులు మంగ, సూర్యనారాయణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ ఎందుకూ పనికిరాడు



భీమిలిలోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును విమర్శించే స్థాయి లేదు
- వార్డు మెంబర్‌గా కూడా గెలవని లోకేష్‌కు మాట్లాడే అర్హతే లేదు
- వైఎస్సార్ సీపీ భీమిలి నాయకులు

భీమునిపట్నం: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఎందుకూ పనికిరాని వ్యక్తి అని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. అటువంటి వ్యక్తి ప్రజాదరణ కలిగిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును విమర్శించడం విడ్డూరంగా వుందన్నారు. తగరపువలస సభలో ఎమ్మెల్యే ముత్తంశెట్టిని లోకేశ్ విమర్శించడంపై వారంతా మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, భీమిలి, ఆనందపురం మండలాల జెడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు, కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు మాట్లాడారు.

గత ప్రభుత్వంలో భీమిలి నియోజకవర్గంలో భారీగా భూకబ్జాలు జరిగాయని, పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా నియోజకవర్గంలో అవినీతిరహితంగా వైఎస్సార్ సీపీ పాలన సాగుతోందన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఆధ్వర్యంలో వందలాది కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. పేదలు, బడుగు వర్గాల ప్రజల కోసం ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఎన్నో మంచి పనులు చేశారని, అటువంటి గొప్ప వ్యక్తిని నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించమని హెచ్చరించారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులతోపాటు ఎన్నో సమస్యలు పరిష్కరించారని గుర్తు చేశారు. ఎర్ర పుస్తకాన్ని పట్టుకుని పిచ్చిపిచ్చిగా మాట్లాడడంతో లోకేష్‌ను ప్రజలు పట్టించుకోవడం లేదని, అసహ్యించుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు, లోకేష్ దిగజారి మాట్లాడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు జీరు వెంకటరెడ్డి, జగ్గపల్లి ప్రసాద్, అక్కరామాని రామునాయుడు, ఎస్.కరుణాకరరెడ్డి, బంక సత్యం, కదిరి ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

మచ్చ లేని మనిషి ముత్తంశెట్టి

పద్మనాభం: భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మచ్చ లేని మనిషి అని జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు అన్నారు. పద్మనాభంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై టీడీపీ నాయకుడు నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. భూ, ఇసుక కబ్జాలు టీడీపీ హయాంలోనే జరిగాయన్నారు. దమ్ముంటే నారా లోకేష్ భీమునిపట్నం నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై పోటీ చేయాలని సవాల్ విసిరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

తగరపువలస : త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక విజయరాంపురం ప్రతినిధులు భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం, చిప్పాడ, అన్నవరం పంచాయతీల్లో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరాత్రి విశిష్టతను వివరించారు. గర్భగుడి ప్రాశస్త్యం, గోపురంలోని ద్వారాలు, సుగుణోపాశన, నిర్గుణోపాశన వ్యత్యాసాలను వివరించారు. ప్రచార కార్యక్రమంలో కనకల త్రినాథరావు, వి.సురేష్, బి.అంకమ్మ, రాజేశ్వరి, కె.రాజు, వి.భవానీ, బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు.



పెదనాగమయ్యపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న విజయరాంపురం ప్రతినిధులు

జాతీయ రహదారిపై అంధకారం

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం చోటు చేసుకుంది. దీంతో ఇరు వైపులా సర్వీస్ రోడ్లపై కూడా చీకట్లు అలుముకున్నాయి. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి, సర్వీస్ రోడ్లపై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ఆటో కార్మికులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వలందపేట వరకు ఇదే పరిస్థితి నెలకొనడంతో భారీ వాహనాల కార్మికులు కూడా అయోమయానికి గురవుతున్నారు. చీకట్లకు తోడు ఎదురుగా వచ్చే వాహనాల లైట్లు కళ్లపై పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే హైవేపై విద్యుత్ దీపాలు పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు.



చీకటిగా ఉన్న తాళ్లవలస సర్వీస్ రోడ్డు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ : ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి నవోదయ ఫీడర్ నందు నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొమ్మాది ఏఈఈ నరేష్ చెప్పారు. ఈ మేరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కొమ్మాది జంక్షన్, వైభవ్‌నగర్, ప్రశాంతి నగర్, రిక్షా కాలనీ, అన్నంరాజు నగర్ లే అవుట్, అష్టలక్ష్మి ఆలయం ఏరియా, డీఆర్‌కే రాజు లే అవుట్, జీసీసీ లే అవుట్, రిక్షా కాలనీ, ప్రశాంతి నగర్, గాయత్రి కాలేజీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ పరఫరా నిలిచిపోతోంది. వినియోగదారులు గమనించి సహకరించాలని నరేష్ కోరారు.

శ్రీవారి భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

తగరపువలస : రుషికొండలోని శ్రీగోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు వసతులు కల్పించాలని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న కోరారు. ఈ మేరకు టీటీడీ కార్యనిర్వహణాధికారికి లేఖ రాశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నప్రసాదాలు, కేశఖండనశాల, విశ్రాంతి భవనాలు కల్పించాలన్నారు. అలాగే తిరుమల తరహాలో శ్రీవారి నిత్య కల్యాణం, ఆలయ ఆవరణలో ధార్మిక, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించాలని కోరారు. ఆలయ సమాచారంలో భాగంగా దర్శనాలు, సేవల వివరాలు నిత్యం తెలిసేలా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని కోరారు. రానున్న వేసవి కారణంగా తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఇప్పటికే టీటీడీకి చెందిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో కూడా ఈ మేరకు కోరినట్టు అప్పన్న తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మధురవాడ శిల్పారామం జాతరలో నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విశాఖ నగరానికి చెందిన జోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాకారులు ఉష, స్రవంతి, సంధ్య, విజయలక్ష్మి, యశ్విత, దామిని, శశి, అక్షర, పద్మ, హాస్య, కీర్తి నృత్యం చేశారు.

చదవని పుస్తకాలను డొనేట్ చేయండి



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గ్రంథాలయ గాంధీ వెలగా వెంకటప్పయ్య 9వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక పురస్కారాన్ని ఉండ్రాజవరం గ్రంథపాలకుడు నున్న వెంకట రామారావుకు ఆచార్య పి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.మూర్తి రచించిన 'డెవలప్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ అండర్ సీఎస్ఆర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ పుస్తకాన్ని చదువుతుంటే వచ్చే ఆనందం.. మొబైల్, కంప్యూటర్స్‌లో చదివితే రాదన్నారు. కంపెనీలు తమ లాభాల్లో కొంత భాగాన్ని సీఎస్ఆర్ కింద పబ్లిక్ లైబ్రరీల అభివృద్ధికి ఇచ్చేలా సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ కృషి చేసిందని కొనియాడారు. విశాఖ పౌర గ్రంథాలయం అభివృద్ధే దీనికి నిదర్శనమన్నారు. చాలా మంది వద్ద పుస్తకాలు చదవకుండా ఉన్నాయని, వాటిని ప్రజలకు ఇచ్చేలా బుక్ డొనేషన్ క్యాంపెయిన్ నిర్వహించాలని కోరారు.

భీమిలిలో మరోమారు ఫ్యాన్ ప్రభంజనం

తగరపువలస: మరోమారు భీమిలిలో ఫ్యాన్ ప్రభంజనం ప్రతిపక్షాలకు చూపించేలా మహిళలంతా కలిసి కట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం తనను కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి డబ్బీరు ప్రశాంతిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ శిష్టకరణాలను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బీసీ జాబితాలో చేరిస్తే... ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా మరో మెట్టు ఎక్కించారన్నారు. తామంతా వైఎస్సార్‌సీపీకి రుణపడి ఉంటామన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు

డబ్బీరు ప్రశాంతికి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి అప్పగించడం పట్ల పలువురు శిష్టకరణాల ప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రశాంతిని అభినందించారు. వీరిలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్, బెహరా భాస్కరరావు, మంత్రి రాజశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు కేవీ మహంతి, భీమిలి అధ్యక్షుడు శేఖరమహంతి దుర్గా పట్నాయిక్ ఉన్నారు.



డబ్బీరు ప్రశాంతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సహకార సంఘాల కంప్యూటరీకరణకు చర్యలు

- పూర్తి స్థాయిలో రైతుల వివరాలు నిక్షిప్తం
- వాటి ఆధారంగానే భవిష్యత్‌లో రుణాలు

ఆనందపురం : గ్రామ స్థాయిలో రైతులకు రుణాలు అందించే వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలను పూర్తిగా కంప్యూటరీకరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలు రావడంతో సహకార సంఘాల సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. ఇంత వరకూ రైతుల వివరాలు సహకార సంఘాల వద్ద అరకొరగా ఉన్నాయి. దీంతో రుణాల మంజూరు, ఇతర సాయాలు అందించే సమయంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రైతుల పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరుకు వివరాలు పూర్తిగా సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ముఖ్యంగా భూములు లేని రైతులు కూడా కొన్ని సహకార సంఘాల్లో సభ్యులుగా కొనసాగుతూ రుణాలు కూడా పొందుతున్నారు. దీనివల్ల రుణ మాఫీ, వడ్డీ మాఫీ జరిగే సమయంలో సిబ్బంది కొంత గందరగోళానికి గురవుతున్నారు. ఇలాంటి వాటిని అధిగమించడానికి ప్రస్తుతం సేకరిస్తున్న వివరాలు సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

సమగ్ర వివరాలతో కంప్యూటరీకరణ

మండలంలోని ఆనందపురం సహకార సంఘంలో 1,462 మంది, శొంఠ్యాం సంఘంలో 2,032 మంది, వేములవలస సంఘంలో 1,205 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సహకార సంఘంలో సభ్యునిగా వున్న రైతు కేటగిరీ, అతని పేరున ఆన్‌లైన్‌లో ఉన్న భూముల వివరాలు, అతని హక్కు స్వరూపం, కులం, ఓటరు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, రేషను కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, నామినీ వివరాలు సేకరించి కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. రైతుల వివరాలను ఆధార్, ఫోన్ నంబర్‌తో అనుసంధానం చేస్తున్నారు. దీంతో వాణిజ్య బ్యాంక్‌ల వలే రైతులకు కూడా పలు సేవలు అందించడం సులభతరమవుతుంది. ఈ విషయమై ఆనందపురం సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు మాట్లాడుతూ రైతుల పూర్తి వివరాలు కంప్యూటరీకరించడం వల్ల సహకార సంఘాల ద్వారా జరిగే లావాదేవీలు ఎప్పటికప్పుడు అన్నదాతలకు ఫోన్ ద్వారా సమాచారం అందించవచ్చన్నారు నిజమైన రైతులకే సహకార సంఘాల ద్వారా రుణాలు అందుతాయని, భవిష్యత్‌లో రుణమాఫీ, వడ్డీ రాయతీ కాలంలో అందడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. రైతులు ఈ విషయం గమనించి పూర్తి వివరాలు సిబ్బందికి అందించాలని అప్పారావు కోరారు.

ఆలయ అభివృద్ధికి రూ.40 లక్షలతో ప్రతిపాదనలు



రవికుమార్‌కు ప్రతిపాదనల కాపీ అందజేస్తున్న ఈవో నానాజీ బాబు

పద్మనాభం : అనంత పద్మనాభ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.40 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు. ఇటీవల రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అనంత పద్మనాభ స్వామి, కుంతీ మాధవ స్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కొంతమంది అనంత పద్మనాభ స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జీవీఎల్‌ను కోరారు. దీంతో అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించి తనకు అందజేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు దేవదాయ శాఖ అధికారులు పంచాయతీ రాజ్ ద్వారా కన్నయ్య కోనేరు, వంటశాల అభివృద్ధి చేయడానికి, కల్యాణ వేదిక నిర్మాణానికి రూ.40లక్షలు అవసరమని ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ ప్రతిపాదనలను ఈవో నానాజీబాబు బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్‌కు ఆదివారం అందజేశారు. రవికుమార్ దీన్ని ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు అందజేస్తారని తెలిపారు.

కుర్తాళం పీఠాధిపతికి ఘన స్వాగతం

సీతంపేట: అమృతోత్సవం పేరిట నిర్వహిస్తున్న శ్రీలలితా పీఠం 75వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు కుర్తాళం పీఠాధిపతి, జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆదివారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి వచ్చారు. కుర్తాళం నుంచి వచ్చిన స్వామీజీ, శక్తి పీఠాధీశ్వరి రామ్యానంద భారతీ స్వామినిలకు పీఠం వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి దారి పొడుగునా పూలతో ఆహ్వానించారు. ఈ నెల 19 నుంచి 24 వరకు పీఠాధిపతి సమక్షంలో అమృతోత్సవాలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

ముగిసిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు



శ్రీలలితా మహా త్రిపుర సుందరిగా రాజశ్యామల

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి శ్రీరాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో నిర్వహించిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. నవరాత్రులు చివరి రోజున అమ్మవారు రాజశ్యామలగా భక్తులకు దర్శనమిచ్చారు. రాజశ్యామల అమ్మవారిని దర్శనం చేసుకునే భక్తులకు సమస్త భోగభాగ్యాలు,సద్విద్య అవగతమవుతాయని నమ్మకం.రాజ్యాధికారం, పదవీ కాంక్షితులకు అమ్మవారి దర్శన భాగ్యం ద్వారా కటాక్షం కలుగుతుందని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. అమ్మవారి సన్నిధిలో సహస్రనామావళి అర్చన, రాజ శ్యామల హోమం నిర్వహించారు. సాయంత్రం హరికాదేవి శ్యామా అమ్మవారి చరిత్రను తెలుపుతూ హరికథా కథనం గావించారు. సాయంత్రం శ్యామా సిరిజ్యోతి పూజ చేశారు. అమెరికా,రష్యా దేశాల నుంచి వచ్చిన సాధకులు నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. గురుమాత అన్నపూర్ణమ్మ భక్తులందరినీ ఆశీర్వదించారు.

భారత సంస్కృతి, నాగరికతపై అవగాహన అవసరం



డాక్టర్ వామదేవ శాస్త్రిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీ కాలనీ: పాశ్చాత్య దేశాలు విశ్వసిస్తున్న భారతదేశ సంస్కృతి, నాగరికతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పండిట్ వామదేవ శాస్త్రి సూచించారు. శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'రీకన్‌స్ట్రక్టింగ్ ది కల్చరల్ హిస్టరీ ఆఫ్ భారత' అంశంపై రెండు రోజుల సింపోజియంను ఎంవీపీ కాలనీలోని ఐఐఎం వేదికగా నిర్వహించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి పండిట్ వామదేవ శాస్త్రి మాట్లాడుతూ భారత దేశం గొప్ప, సజీవమైన నాగరికతను కలిగి ఉందన్నారు. అయితే చాలా మంది పాశ్చాత్య చరిత్రకారులు భారత సంస్కృతిని వక్రీకరించి రాశారన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రాచీన చరిత్ర మూలాలను, నాగరికతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు ప్రపంచానికి అందించాలన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాకుమారి మాట్లాడుతూ శివానంద సుపథ ఫౌండేషన్ ద్వారా ప్రాచీన భారత చరిత్రను నేటితరానికి వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఆచార్య సుదర్శనరావు, ఆచార్య ఆర్.రాఘవేంద్రన్ పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: నగర కమిషనర్ డా.రవిశంకర్, అడిషనల్ కమిషనర్ వెంకటరావు(స్పెషల్ బ్రాంచ్) ఆదేశాల మేరకు గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా గంజాయి తరలిస్తున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ మొయిన్ గేటు వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లా అట్లగూన గ్రామం అరకుకు చెందిన పంగి గోపినాథ్ అనే యువకుడు అరకు నుంచి బెంగుళూరుకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నాడని సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఆదేశాల మేరకు ఎస్ఐ భరత్‌కుమార్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా.. నాలుగు కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించి పోలీసులకు అప్పగించారు. ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.